కథ

# ప్రొఫెసర్‌గారి ఆంతర్యం

**కాలువ మల్లయ్య**



**కూరగాయల బుట్ట తెచ్చి భార్య చేతికిచ్చాడు విశ్వనాథం. "అమ్మయ్య! మార్కెట్‌కు వెళ్ళడమే తలనొప్పి... అందులో ఆదివారం మార్కెట్... జనం... దుమ్ము.. ధూళి... నువ్వే తెచ్చుకోవోయ్ కూరగాయలంటే తెచ్చుకోవు" సోఫాలో కూర్చుంటూ అన్నాడు.**

కూరగాయలను అటూ ఇటూ తిరగేసింది జయమ్మ. ముక్కు విరిచింది.

భర్త దిక్కు తిరస్కారంగా చూసింది.

"యూనివర్శిటీ ప్రొఫెసర్‌గారైన రచయిత తెచ్చిన కూరగాయలవి. వంకాయలు పుచ్చువి... బెండకాయలు ముదిరినవి... అరటిపళ్ళేమో మురిగిపోయినవి... తెచ్చిన సరుకులివి. మార్కెట్‌కెళ్ళి ఘనకార్యం చేసుకొచ్చినట్టు మాటలు... మార్కెటంతా తిరిగితే మీకివే దొరికాయా? ఏంగొప్ప కూరగాయలు తెచ్చారండీ! ఇవేమన్నా పుక్కెడికొచ్చాయా?"

జయమ్మ మాటలకు ముఖం మాడ్చుకున్నాడు విశ్వనాథం.

"స్వర్గానికెళ్ళినా సవతిపోరు తప్పలేదన్నట్టు ప్రొఫెసర్నయినా నాకీ కూరగాయల తిరస్కారం తప్పకనేపాయె. నేనుతెస్తే వంక పెడతావు. మరి నువ్వే తెచ్చుకుంటే నేను వద్దన్నానా?"

ఆ మాటలకాతని మీదకి లేచినట్టుంది జయమ్మ...

"మీరింట్లో గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంటే నేను మార్కెట్‌కెళ్ళి కూరగాయలు కొనుక్కురావాలా? ఆడవాళ్ళెళ్ళి తేవాల్సిన అవసరమేముంది?"

"అయ్యో పిచ్చిపిల్లా! ఇంకే కాలంలో ఉన్నావోయ్ నువ్వు? ఎంతమందాడవాళ్ళు మార్కెట్‌కెళ్ళి వస్తువులు తెచ్చుకోవడంలేదు? కూరగాయలమ్మేది చాలామంది ఆడవాళ్ళే. తెస్తేనేమో మెచ్చుకపోతివి... తెచ్చుకోమ్మంటే బయటకెళ్ళకపోతివి. నేనింట్లో ఖాళీగా కూర్చుంటాననా నీ బాధ? నేనెప్పుడూ ఖాళీగా ఉండనన్న విషయం నీకు తెలియందా? ఏదో చదువుకోవడమో, రాసుకోవడమో ఉండనే ఉంటుంది"

"అదికూడా ఓ పనన్నట్టేనా?"

కూరగాయలు ఫ్రిజ్‌లో సర్దుతూ అంది జయమ్మ.

"నువ్వు మార్కెట్‌కెళితే రెండు లాభాలున్నాయి. ఒకటి... బేరమాడి తక్కువ ధరలో మంచి కూరగాయలు తేవచ్చు. రెండవది... ఒంటరిగా మార్కెట్‌కెళ్తున్న నన్ను అందమైన ఆడవాళ్ళ బారినుండి కాపాడవచ్చు" నవ్వుతూ అన్నాడు విశ్వనాథం.

"అబ్బో బాగానే ఉంది సంబడం. మీరెంత ప్రొఫెసరైనా మీవెంట ఏ స్త్రీ కూడా పడదన్న గ్యారంటీ నేనిస్తాను"

"ఏం నేను అందంగా లేనా? నువ్వు రోజూ చూస్తున్నావు కాబట్టి అలా కనబడ్తానుకాని కొత్తవాళ్ళకు బాగానే కనబడ్తాను"

"ఈ రోజేంటి భలే హుషారు మీదున్నట్టున్నారు. అందుకే ఈ పుచ్చువంకాయలు కొనుక్కొచ్చారా? ఇంతకీ వీట్నెలా ఇచ్చారు?"

కిలో వంకాయల ధర చెప్పాడు విశ్వనాథం. "మంచి వంకాయలకే ఆ ధర లేదంటే వీటికంత ధరెలా పెట్టారండీ" మొత్తుకున్నట్టుంది జయమ్మ.

"ఏదోలేవోయ్! నాకు వాళ్ళతో బేరమాడటం నచ్చదు. పాపం వాళ్ళెంత కష్టజీవులో నీకేమన్నా తెలుసా? పంట రైతు చేతికి రావాలంటే నెలల తరబడి మట్టిలో మట్టయి పనిచేయాలి. అర్ధరాత్రి లేచి కూరగాయలు తెంపుకొని గంపల్లో వేసుకొని పడుతూ లేస్తూ మైళ్ళ తరబడి నడుచుకుంటూ వస్తారు వాళ్ళు. పావలా, అర్ధరూపాయి కోసం వాళ్ళతో బేరమాడి విసిగించడం దేనికి? పోతే ఓ రూపాయెక్కువ పోతుందేంటి?" అన్నాడు విశ్వనాథం.

"బాబోయ్! మిమ్మల్ని కదిలిస్తే కష్టం. ఇంకా ఏమన్నా అంటే మీరొచ్చిన రైతు కుటుంబ నేపథ్యం, రైతు కష్టాలన్నీ ఏకరువు పెడతారు. అవన్నీ ఇప్పుడొద్దు. రైతుకేదో చేస్తున్నామని ఏవిపడితే అవి తెచ్చుకోవడమేనా? అయినా మీరు కొనేసరికి కూరగాయలెన్ని చేతులు మారతాయో మీకు తెలియదనుకుంటాను"

"మారితే మారతాయి. నేను మాత్రం సాధ్యమైనంతవరకు పల్లెల్నుంచి వచ్చే వాళ్ళ దగ్గరే కొంటాను. మారు బేరగాళ్ళ దగ్గర కొనేది చాలా తక్కువ. ఏదేమైనా నాకు బేరం చేయడం ఇష్టం వుండదు. కొసరికొసరి అడగడమూ నచ్చదు. నువ్వన్నంత పాడైనవి నేనేం తేవడంలేదు. ఒకటి రెండు లాంటివున్నా తీసిపారెయ్యలేవు. ఏం మునిగిపోతుంది? ధర కొంచెం ఎక్కువ పెట్టినట్టవుతుంది అంతేకదా! అదెవరికి పోతుంది? ఆ కష్టజీవులకే కదా!"

విశ్వనాథం మాటలకు నోరు తెరిచింది జయమ్మ.

"మీ పక్షపాతం పాడుగాను. ఎంత పేదల పక్షపాతమున్నా తనకుమాలిన ధర్మముంటాదండి. మీరెక్కడ దొరికారండీ నాకు?" అంది.

"ఎక్కడ దొరికానేంటోయ్... వీరతెలంగాణా నేలలోని ఓ గ్రామంలో- మీనాన్నే నా చుట్టూ తిరిగి నా కోసం ఎంక్వైరీలు చేసి ఎన్నిక చేశాడు కదా! నీకు తెలియదా?"

"భలేవారులెండి మీరు. మీరు మా ఇంటి చుట్టూ తిరిగారా? మేమా? అప్పుడు మీరు ప్రొఫెసరు కాదు. మీకు ఉద్యోగమే లేదని మర్చిపోకండి. నన్ను చూసింతర్వాత ఇంకెవర్నీ చేసుకోనని నావెంటే పడ్డారుకదా!"

"ఎర్రగా బుర్రగా ఉన్నావని పడ్డమాట నిజమే. అలాగే నీ మనసూ నాలాగా ఉంటే బాగుండేది. నా చదువు చూసి నేను కాబోయే ప్రొఫెసర్నని తెలిసే మీ నాన్న నన్ను సెలెక్ట్ చేశాడు" అంటూ నవ్వాడు విశ్వనాథం.

"ఎప్పుడూ సీరియస్‌గా ఉన్నట్టు కనబడే మీకూ సెన్సాఫ్ హ్యూమర్ ఉందన్నమాట ఫర్వాలేదు" అంటూ జయమ్మా నవ్వింది.

"సెన్సాఫ్ హ్యూమర్ లేకుంటే ఈకాలంలో కష్టమోయ్! అడుగడుగునా టెన్షనేకదా బతుకులో. నాకే హాస్యప్రియత్వం లేకుంటే నేనెప్పుడో ఆత్మహత్య చేసుకునేవాడిని అన్నాడట గాంధీజీ"

"హాస్యం ప్రతివారి జీవితంలోనూ ముఖ్యమైందే. సరేగాని మీరికనైనా మీ విధానాన్ని మార్చుకోరా?"

"మార్చుకుంటానికేముందోయ్ నాలో... నేనేమన్న తప్పు చేస్తున్నానా? ఈదేశంలోని ఆర్థికశాస్త్రాలనన్నిటినీ ఆపోసన పట్టినట్టు ఫోజు పెడతావు నువ్వు. నిజానికి నీకు తెలిసిన ఆర్థికశాస్త్రమెంత స్వార్థంతో కూడుకున్నదో నీకర్థంకాదు. ఏమన్నా అంటే అందరితో మనమంటావు. డబ్బు సంపాదించడంలోనూ, ఖర్చు చేయడంలోనూ కొంతయినా హ్యూమానిటీ టచ్ ఉండాలోయ్. అదే కరువవుతుంది లోకంలో..."

ఆ మాటలకు తల పట్టుకొని కూర్చుంది జయమ్మ.

ఇంతలో విశ్వనాథం సన్నిహిత మిత్రుడు మోహన్‌రెడ్డి లోపలికొచ్చి సోఫాలో కూర్చున్నాడు. ఆతడు విశ్వనాథం మనసెరిగినవాడు.

"ఏంటీ! ప్రొఫెసర్‌గారూ... మా చెల్లెమ్మ ఏదో వాదించుకుంటున్నట్టున్నారు. ఇక్కడున్న వస్తువులను చూస్తుంటే కూరగాయలు- ధరలు, కూరగాయలు- వాటి సృష్టికర్తలు- వీటిని గురించేననిపిస్తుంది. అంతేనా?" అంటూ నవ్వాడు.

"ఇదెప్పుడూ ఉన్నదే కదన్నయ్యా! పుచ్చు వంకాయల్ని రూపాయి ధర ఎక్కువపెట్టి కొంటాడీయన. చిన్నపిల్లవాడని పదేపదే చెప్పాలా? ఏమన్నా అంటే వాటిని ఎవరు కొంటారోయ్? హ్యూమాలిటీ టచ్ ఉండాలోయ్ అంటాడు. ఏం చెప్పమంటారన్నయ్యా?" అంది జయమ్మ.

"మీ ఆయన నిర్వాకం నాకు తెలుసమ్మా. ఆయనకు గ్రామాలంటే ఇష్టం. సర్వసంపదలకు సృష్టికర్తలు పల్లీయులే అంటాడు. వాళ్ళకేవిధంగానూ నష్టం జరగకూడదంటాడు. ఒకసారేమైందో తెలుసామ్మా..."

ఆ విషయం చెప్పవద్దన్నట్టు సంజ్ఞ చేశాడు విశ్వనాథం. "ఏమైందో చెప్పండన్నయ్యా... ఏదో ఘనకార్యమే అయుంటుంది"

ఇక తప్పదన్నట్టు చెప్పసాగాడు మోహన్‌రెడ్డి.

"ఆర్నెల్లక్రితమనుకుంటాను... మేమిద్దరం కలిసి మార్కెట్‌కు వెళ్ళాం. అప్పుడు నువ్వింట్లో లేవనుకుంటాను. అదివరకెన్నోసార్లు మేమిద్దరమెళ్ళినా నేను పెద్దగా గమనించలేదు. నేనారోజు మార్కెట్లో మీ ఆయనవెంటే ఉన్నాను. మార్కెట్లో ప్రతివాళ్ళూ ఈ ప్రొఫెసర్గార్ని పిలవడమే. మీలాంటివాళ్ళొస్తే మాకు బాధలేదుసార్! అందర్లా మీరు కొసరికొసరి బేరం చేయరు. అన్నీ కెలికికెలికి పాడుచేయరు... అన్నీ

మర్లేసితిర్లేసి అతలాకుతలం చేయరు... అనే వాళ్ళే. ప్రొఫెసర్‌గారు ఒక్కరి దగ్గర కూడా బేరం చేయలేదు. కూరగాయలను ముట్టి చూడలేదు. వాళ్ళు చెప్పిన ధరకు వాళ్ళిచ్చినవి సంచిలో వేసుకొని డబ్బులు చేతిలో పెట్టాడు. విశ్వనాథమంటే వాళ్ళందరికీ అభిమానమే. పల్లెటూరి వాళ్ళమీద ఆతనికంత నమ్మకం. ఇదీ మీవారు చేసే బేరం తీరు"

ఆ మాటలు విని భర్తనో అమాయకుడిని చూసినట్టు చూసింది జయమ్మ. "మోహన్‌రెడ్డీ... నువ్వారోజు కూరగాయలు కొన్నావుగదా! నీకు చెప్పిన ధర నాకు చెప్పలేదన్న విషయం మరిచిపోకు. ఎలాగూ కొసురుతారని నీలాంటి వాళ్ళకు ఎక్కువ ధర చెప్పి కొంత తగ్గిస్తారు. నా దగ్గర ఎక్కువేం తీసుకోరువాళ్ళు"

"ఆ మాట నిజమేకావచ్చు కాని ఎవరి మీదనైనా అంత నమ్మకం పనికిరాదోయ్. పల్లెటూరు వాళ్ళైనంత మాత్రాన వాళ్ళంతా నువ్వనుకున్నంత మంచివాళ్ళేం కారు. ఇప్పుడు వాళ్ళలోనూ వ్యాపార మనస్తత్వం పెరిగింది"

"ఇది అమాయకత్వమో అతి తెలివో అర్థం కాదన్నయ్యా! మనుషులనంత గుడ్డిగా నమ్మడం మంచిదికాదు..."

"విశ్వనాథంది ఇంటలెక్చువల్ బ్రెయినమ్మా. అయితే ఆ ఇంటల్‌జెన్స్‌ను తన కుటుంబానికో, కెరీర్‌కో ఉపయోగించుకునే మనస్తత్వంకాదు. ప్రతివాడూ ఎంతోకొంత సమాజానికి ఉపయోగపడాలంటాడు. ఇలాంటి మంచివాళ్ళను పిసోడంటుంది సమాజం. అలాంటి పిసోడే విశ్వనాథం..." అంటూ నవ్వాడు మోహన్‌రెడ్డి.

మిత్రునితోపాటు విశ్వనాథమూ నవ్వాడు.

పనిమనిషి టీ తీసుకొచ్చిచ్చింది వాళ్ళకు.

"నేను డబ్బు ఖర్చు గురించి చెప్పడంలేదు. పనిమనిషికిచ్చే దానికంటే రెట్టింపిచ్చినా మంచిదేనని నా అభిప్రాయం. కాని ఇంట్లో ఉన్న కాస్త పనికి పనిమనుషులను పెట్టుకొని శ్రమ లేకుండా చేసుకొని డైటింగ్‌లు, ఎక్సర్‌సైజులు చేయడమెందుకు చెప్పు? కిలోమీటరు, అరకిలోమీటరు దూరాలకు కూడా వెహికిల్‌ను ఉపయోగించి వాకింగ్‌ల పేర్లమీద నడవడమెందుకు? ఇవి నాగరిక సమాజమని చెప్పబడే వాళ్ళలోని వైరుధ్యాలు... ఇలాంటివి సరైనవి కాదంటే పిసోడంటారు. అలా అయితే నాకు పిసోడుగా ఉండటమే ఇష్టం"

"అది నిజమే విశ్వనాథం. కాని ఎవరి హోదాకు తగ్గట్టు వాళ్ళుండాలి. ప్రొఫెసర్‌వై ఉండీ సైకిల్‌మీదో, కాలినడకనో పోతానంటే ఏమన్నట్టు? డ్యూటీలకు కార్లమీదనో కనీసం స్కూటర్ల మీదనో పోవాలి. మార్నింగ్ వాకులూ చేయాలి... పెద్ద హోదాలో ఉండి సింపుల్‌గా ఓ కార్మికుడిలా బతుకుతానంటే ఎలా? అలా ఉంటే పిసోడంటారు... ఇదీ లోకం" అన్నాడు మోహన్‌రెడ్డి.

"సింప్లిసిటీలోనే ఆనందముంది- ఆడంబరంగా డ్రెస్ చేసుకుంటే ఏదో గౌరవం లభిస్తుందనుకోవడం పొరపాటు. డిగ్నిఫైడ్‌గా డ్రెస్ చేసుకోవడం మనిషిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని అంబేద్కర్‌లాంటి వాళ్ళు భావించినా నాకుమాత్రం సింపుల్‌గా ఉండటమే ఇష్టం" అన్నాడు విశ్వనాథం.

"ఇదీ అన్నయ్యా ఈయన సంగతి. మీ ప్రొఫెసర్లంతా హుందాగా సఫారీ డ్రెస్‌లు వేసుకోవడం లేదా?" అంది జయమ్మ.

"అవి వేసుకున్న వాళ్ళను నేను విమర్శించడంలేదు. అవి వేసుకోవడం తప్పనీ నేననడంలేదు. కాని సఫారీ డ్రెస్ వేసుకుంటే శరీరంమీద పాములు, జెర్రులు పాకినట్టనిపిస్తుంది నాకు. ఏదో బరువు మీద పెట్టుకున్నట్టు అనిపిస్తుంది. డ్రెస్‌తోనే గౌరవం లభిస్తే చిన్న పంచె కట్టుకొని ఉండే గాంధీజీ బ్రిటిష్‌వాళ్ళను, కోట్లాది ప్రజానీకాన్ని ప్రభావితం చేసేవాడుకాదు. ఫుల్‌సూట్‌లో దర్జాగా ఉండే నెహ్రూ కంటే గాంధీ ఎక్కువ గౌరవ పాత్రుడైంది అతని పనుల వల్లనే కాని డ్రెస్‌వల్ల కాదు" అన్నాడు విశ్వనాథం.

"చెల్లెమ్మా! ఈ ప్రొఫెసర్‌గారివి ఉన్నతాశయాలు. అందరికీ అందేవాడు కాదీయన. ఈకాలంలో పుట్టాల్సినవాడూ కాదు. ఇతన్ని అర్థం చేసుకోవడం కష్టం. ఇతన్ని పిసోడనే వాళ్ళూ ఉన్నారు"

"నన్ను ములగచెట్టెక్కించకోయ్ మోహన్‌రెడ్డి. నాకు మీరన్నట్టు పిసోడుగా ఉండటమే ఇష్టమని చాలాసార్లు చెప్పాను.

"మిమ్మల్ని నిజంగానే ఎర్రగడ్డ దవాఖానాలో చేర్పిస్తాను. ఎప్పుడూ ఏదో ఆలోచించడం, రాయడం వల్ల మీకు మెంటల్ స్టెబిలిటీ లేదని చెబితే డాక్టర్లు నమ్ముతారు. మీ కూరగాయల చేష్టలు, ఇతర పనుల గురించి చెబితే వాళ్ళు ఖచ్చితంగా నమ్ముతారు" అంటూ నవ్వింది జయమ్మ.

"ఆ పని చేయవోయ్... హాయిగా వాళ్ళతో కలిసుంటాను. ఈ స్వార్థపూరిత ప్రపంచంలో కంటే అక్కడే బాగుంటుందేమో... నిజంగా ఏదీ తెలియకుంటే ఏ ఆలోచనా లేకుంటే ఎంత హాయి? ఎంత సుఖం?" అన్నాడు విశ్వనాథం నవ్వుతూ.

"చెల్లెమ్మా... ఈ ప్రొఫెసర్‌గారి అరటిపళ్ళ కథ చెబుతాను విను. విన్న తర్వాత నువ్వు నిజంగానే ఇతన్ని ఆ హాస్పటల్‌లో జాయిన్ చేస్తావు" అన్నాడు మోహన్‌రెడ్డి నవ్వుతూ.

"చెప్పండన్నయ్యా! ఇద్దరం కలిసే చేద్దాం"

... అరవై ఏళ్ళకు పైనే ఉంటుందా వృద్ధురాలి వయసు. ముగ్గుబుట్టలా తల... ముడతలు పడ్డ శరీరం- ఆమె ముందు చింకిచాపలో అరటిపళ్ళున్నాయి. రెండు డజన్లకు పైనే ఉన్నాయి. అయితే అవన్నీ మురిగిపోతున్నాయి.

> **డ్రెస్‌తోనే గౌరవం లభిస్తే చిన్న పంచె కట్టుకొని ఉండే గాంధీజీ బ్రిటిష్ వాళ్ళను, కోట్లాది ప్రజానీకాన్ని ప్రభావితం చేసేవాడుకాదు. ఫుల్‌సూట్‌లో దర్జాగా ఉండే నెహ్రూ కంటే గాంధీ ఎక్కువ గౌరవ పాత్రుడైంది అతని పనుల వల్లనే కాని డ్రెస్‌వల్ల కాదు**

"ఐదు రూపాయలకు డజన్" బలహీనంగా అరుస్తోందామె.

ఎంత అరిచినా ఎవరూ ఆమె దగ్గరికి వెళ్ళడంలేదు.

"ఐదు రూపాయలకే డజన్... బయట పదిరూపాయలు" అరుస్తోందామె.

"వట్టిగా ఇచ్చినా వద్దు" అంటూ వెళ్ళిపోతున్నారందరూ.

విశ్వనాథం ఆ వృద్ధురాల్ని, మురిగిన అరటిపళ్ళను చూశాడు.

ఆమె దగ్గరికెళ్ళాడు. "అవ్వా! ఈ అరటిపళ్ళెలా ఇస్తావు?" అన్నాడు.

"డజనుకు ఐదు రూపాయలే బాంచెను"

"బయట పదిరూపాయలుంటే నువ్వింత తక్కువ ధరకెందుకమ్ముతున్నావమ్మా' విశ్వనాథం తనను దెప్పుతున్నాడనుకుందా వృద్ధురాలు.

ముఖం చిన్నబుచ్చుకుంది.

"అవ్వా! ఇవెన్ని డజన్లుంటాయి?"

"మూడు డజన్లుండచ్చు బాంచెను"

"ఇదుగో ఇరవై రూపాయలు తీసుకో.." అని ఆమెకు డబ్బులిచ్చాడు.

వాటినిబుట్టలో వేసుకున్నాడు విశ్వనాథం.

కృతజ్ఞతాపూర్వకంగా అతని దిక్కు చూసింది ముసలవ్వ.

అక్కడినుంచి కదిలాడు విశ్వనాథం.

"విశ్వనాథం... నువ్వు నిజంగానే పిసోనివున్నవు. ఇరవైరూపాయలు పెట్టి మురిగిన పండ్లు కొనడమేంటి?" అన్నాడు అప్పటినుంచి అతనివెంటే ఉన్న మోహన్‌రెడ్డి.

"ఇవి తిందామనేం కొన్లేదు... పాపమా ముసలవ్వ ఈ వయసులో చేతగాకున్నా అరటి పళ్ళమ్ముకుంటుంది. ఆ వంగిన నడుము, లోతుకుపోయున్న కళ్ళు చూస్తుంటే జాలేసింది. వాటిని ఎవరూ కొనరని నాకు తెలుసు. వాటిని తీసుకోవడం వల్ల ఆ ముసలవ్వకు సాయం చేసినట్టవుతుందని కొన్నాను"

విశ్వనాథం మాటలను నోరుతెరిచి వింటున్నాడు మోహన్‌రెడ్డి.

మోహన్‌రెడ్డి చూస్తుండగానే అందులోంచి కొంచెమో తీరుగా ఉన్న నాలుగైదు అరటిపళ్ళను పక్కనపెట్టాడు విశ్వనాథం. మిగతావి చెత్తకుండీ దగ్గరున్న ఆవుముందు పడేశాడు.

"ఏంటోయ్ విశ్వనాథం... నువ్వు చేస్తున్న పని"

"అదంతే... ఆ ముసలవ్వకు బిచ్చగత్తెకిచ్చినట్టిస్తే తీసుకోదు. అందుకే అవి కొన్నట్టు చేసాను"

"ఇదమ్మా మీవారి అరటిపళ్ళ కథ..." చెప్పడం ముగించాడు మోహన్‌రెడ్డి.

తలపట్టుకుంది జయమ్మ.

"చెల్లెమ్మా... విశ్వనాథంది చాలా సెన్సిటివ్ మనసు. పసిపిల్లాడి మనస్తత్వం. ఆతన్నేవిధంగానూ బాధకు గురిచేయకు" అని లేచి వెళ్ళిపోయాడు మోహన్‌రెడ్డి.

** ** **

సోఫాలో పడుకొని ఆలోచిస్తున్న మోహన్‌రెడ్డికి విశ్వనాథంతో జరిగిన సంఘటలెన్నో జ్ఞాపకం వచ్చాయి. సినిమా రీల్లా కళ్ళ ముందు కదులుతున్నాయి.

లేచి నిల్చున్నాడు.

విశ్వనాథం ఇంట్లో ఎవరూ లేరు. వేసవి సెలవులని జయమ్మ పిల్లల్ని తీసుకొని ఊరెళ్ళింది. ఏమైనా తిన్నాడో లేదో ఓసారి చూసొద్దాం... తనలో తానే అనుకుంటూ డ్రెస్ చేసుకున్నాడు మోహన్‌రెడ్డి.

'ఇంట్లో భార్యాపిల్లలు లేకుంటే సరిగ్గా భోజనం చేయడు విశ్వనాథం. ఒక్కోసారి కఠోరమైన ఉపవాసాలే చేస్తాడు రోజులతరబడి. మిత్రులింట్లో తినమన్నా తినడు. హోటళ్ళో తింటే ఖర్చవుతుందనుకునేంత పిసినారి కాడు. పిల్లలింట్లో లేనప్పుడు పనిమనిషీ అవసరం లేదంటాడు. మరా పనిమనిషికి డబ్బులు మాత్రం ఇస్తాడు. అన్నీ ఉండీ కడుపునెందుకు ఆకలితో మాడుస్తాడో తనకు అర్థంకాలేదు. ఇలా చేయడంలో ఆతని ఆంతర్యమేంటి? అసలీ మనిషేంటి?'

తనలో తాననుకుంటూ విశ్వనాథం ఇల్లు చేరుకున్నాడు మోహన్‌రెడ్డి.

ముందు గదిలో కూచొని పేపరు చదువుకుంటున్నాడు విశ్వనాథం.

"రా... రావోయ్... పూర్తిగా నల్లపూసవైపోతున్నావు" పేపరు టీపాయ్‌మీద పెడుతూ అన్నాడు విశ్వనాథం.

"సరేగాని భోజనం చేశావా?" కుర్చీలో కూర్చుంటూ అడిగాడు రెడ్డి.

అతని వాలకం చూస్తుంటే తిన్నట్టు లేదు.

"చేశాను... ఇంతకుముందే" అబద్ధమాడాడు విశ్వనాథం.

"నువ్వు హోటల్‌కెళ్ళలేదు. మరెక్కడ భోంచేశావు?"

"నాకు వంటొచ్చని నీకు తెలియదా? వండుకున్నాను"

"అలాగా... ఏం వండుకున్నావో చూస్తాను" అంటూ వంటగదిలోకి వెళ్ళాడు మోహన్‌రెడ్డి.

వంట చేసిన జాడలెక్కడా కనపడలేదు. కనీసం వంటగిన్నెలను కదిలించిన ఆనవాళ్ళూ లేవు.

ముందుగదిలో కొచ్చి మిత్రునికి ఎదురుగా కూర్చున్నాడు మోహన్‌రెడ్డి.

"ఏంటిది? నువ్వెందుకిలా కఠోర ఉపవాసాలు చేస్తున్నట్టు? ఏంటి నీ ఉద్దేశం? వండుకోవడం చేతకాకుంటే మా ఇంట్లో తినొచ్చు... హోటళ్ళో తినొచ్చు... నీకేం కర్మ పట్టిందని ఘోరంగా ఉపవాసాలు చేస్తున్నావు... ఇది మొదటిసారి కాదు నేను చూసింది.

(మిగతా 32వ పేజీలో)



లైంగికప్రక్రియల చ...కు ఇక్కడి ఆలయాలశి...కళాఖండాలే మూలబిందువులు

అంతా కొత్తసహస్రాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న నేపథ్యంలో, ఖజురహో తన వెయ్యేళ్ళ పండుగను జరుపుకుంటున్న చారిత్రాత్మకస్థలంగా అభివర్ణిస్తారు దిగ్విజయ్. ఖజురహోలోని ఆలయాల సంరక్షణే కాక, చుట్టూపక్కల ప్రాంతాల అభివృద్ధికి కృషిచేయటం, రవాణాసౌకర్యాలు మెరుగుపరచి పర్యాటకులను మరింతగా ఆకర్షించటం ప్రభుత్వకర్తవ్యాలుగా ఆయన గుర్తించినట్టు చెబుతున్నారు. ఖజురహోకు వచ్చిన పర్యాటకులు ఇంకా రాష్ట్రంలోని మహేశ్వర్, ఉజ్జయిని, ఓంకారేశ్వర్, బస్తర్‌లలో పర్యటించేలా చేయాలన్నది ఆయన భవిష్యత్ ప్రణాళిక. ఖజురహోలో ఉన్నత శిక్షణ పొందిన పరిణతి చెందిన గైడ్‌లు అవసరమని అంటారు దిగ్విజయ్. అలాంటి వారున్నప్పుడే ఇక్కడి చరిత్ర గురించిగానీ, ఆలయనిర్మాణాలు, శిల్పాలు అందించే సందేశాలు కానీ సరియైనరీతిలో పర్యాటకులు అర్థం అవుతాయంటారు దిగ్విజయ్‌సింగ్.

ఖజురహోలో మార్చి నుంచి డిసెంబర్ వరకు శాస్త్రీయ నృత్యాలు, వాస్తుశిల్పులు, శిల్పులు, స్థపతుల కలయిక, సంగీతోత్సవం వంటి కార్యక్రమాలు రూపొందించి నిర్వహిస్తున్నారు. డిసెంబరు 31న సహస్రాబ్ది వేడుకలు జరుపుతారు.

వీటన్నింటివల్ల ఖజురహో మరోసారి ప్రపంచానికి మరింత గొప్పగా కొత్తగా అర్థం కాబోతోంది. ప్రభుత్వం, మేధావులు, చరిత్రకారులు చేసే సరైన కృషివల్ల నాటి ఖజురహో దేవాలయాల నిర్మాణం వెనుక ఆలోచనలు, సంస్కృతి, నాటికాలమానపరిస్థితులు సవ్యంగా ఆవిష్కృతం కావల్సిన అవసరం ఉంది. అలాగే అందులో ఆధునిక జీవితానికి సంబంధించిన సమకాలీనత అంశాలను కూడా గుర్తిస్తే ఖజురహో చరిత్రకు మరింత రాణింపు సాధించిపెట్టినట్టవుతుంది.


– రామ్ కె.

ఫోటోలు: గోవింద్

## 'శిల్ప' చరిత్ర

శిల్పకళను ఇంగ్లీషులో 'స్కల్ప్చర్' అంటారు. ఈ పదం 'స్కల్పెరి' (కోయు) అను లాటిన్ పదం నుండి ఉద్భవించింది. ప్రకృతీ దృగ్గచర విషయాలకూ, మానవుని హృదయంలో ఉదయించెడి భావాలకూ రూపకల్పన చేయుటయే యీ కళలోని విశిష్టత. శిల్పకళ ఒక జాతి సంస్కృతి, నాగరికత, కళావైభవాన్ని వెల్లడి చేస్తుంది.

మానవుడు ప్రప్రథమంగా అభ్యసించిన కళ శిల్పకళ అనుటలో అతిశయోక్తి లేదు. క్రీ.పూ. 20వేల సంవత్సరాల నాడు ప్రాచీనశిలాయుగంలో ఆదిమమానవులు జంతువులను వేటాడడానికి, మాంసాన్ని కోయటానికి, ఆత్మరక్షణ కోసం రకరకాల రాతి పనిముట్లను తయారుచేసుకునేవారు. ఈ రాతి పనిముట్లను తయారుచేసే ప్రక్రియ నుండే చిత్రకళ వుద్భవించిందని చెప్పవచ్చు.



శృంగారాన్ని అపరాధమని యెంచే భావజాలాన్ని ధిక్కరించడానికే ఖజురహోలో ఇలాంటి శిల్పాలు ఆవిర్భవించాయని చరిత్రకారుల అభిప్రాయం

## ప్రొఫెసర్‌గారి ఆంతర్యం....

(9వ పేజీ తరువాయి)

ఇలా అయితే నీ ఆరోగ్యం దెబ్బతినదా! ఈ విషయంలో నువ్వు నాకర్థం కాలేదు" అన్నాడు మోహన్‌రెడ్డి.

విశ్వనాథం ఏం మాట్లాడలేదు.

"ఏంటి? బెల్లం కొట్టిన రాయిలా కూర్చున్నావేంటి? నేనీ విషయాన్ని సీరియస్‌గానే అడుగుతున్నాను. ఇలా ఎందుకు చేస్తున్నట్టు?"

"చెప్పక తప్పదంటావా?"

"తప్పదు"

"నీకు కాకుంటే ఇంకెవరికి చెబుతాను. కాని, ఈ విషయం మీ చెల్లెమ్మకు మాత్రం చెప్పకు... ఎందుకంటే ఇదే ఆఖరు ఉపవాసం కాదు..."

చిన్నపిల్లాడిలా అన్నాడు విశ్వనాథం.

సరేనని తలూపాడు మోహన్‌రెడ్డి.

"నేనొకప్పుడు ఆకలిబాధను అనుభవించినవాడినే. ఆకలి పేగు సంగీతం నాకు తెలుసు. ఇప్పుడు మనకు ఆ పరిస్థితులు లేవనుకో! అలాగని మనం మన మూలాలను మరిచిపోయి విర్రవీగే ప్రమాదముంది. పైగా నాకు ఆకలిపేగు బతుకులపై సానుభూతుంది. వాళ్ళపై కథలూ రాస్తున్నాను. మరి ఆకలిపేగుల గురించి రాయాలంటే కొంతైనా ఆకలిబాధను అనుభవించాలి. అందులో ఎంత వేదనుందో అనుభవిస్తేకాని తెలియదు. కడుపులో పేగులు ఆకలితో అరుస్తుంటే ఎంత బాధుంటుందో అనుభిస్తేగాని తెలియదు. జయ, పిల్లలు ఇంట్లో ఉంటే అలాచేసే అవకాశం లేదు. అందుకే నేనొంటరిగా ఉన్నప్పుడు ఆకలి ప్రాక్టీసు చేస్తున్నాను. ఆకలిని అనుభవిస్తున్నాను."

మిత్రుని దిక్కు ప్రశంసాపూర్వకంగా చూస్తున్నాడు మోహన్‌రెడ్డి.

విశ్వనాథం రాసిన ఆకలి కథలు ఎందుకంత సహసంగా, వాస్తవికంగా ఉంటాయో మోహన్‌రెడ్డికి ఇప్పుడు అర్థమైంది.

"ఇప్పుడు నేను ఆర్థికంగా మంచి స్థితిలోనే ఉన్నాను. హుందాయైన డ్రెస్సులు వేసుకోవడం, మృష్టాన్న భోజనం చేసే స్థితిలోనే ఉన్నాను. కాని దేశంలోని కోట్లాది జనం దుర్భర పేదరికంలోనే ఉన్నారు. నా పాలివాళ్ళూ అంతే... వాళ్ళకోసం నా పరిధిలో నాకు చేతనైంది చేస్తూనే ఉన్నాను. వాళ్ళనుంచి దూరం కాకుండా ఉండటానికి నాకు సాధ్యమైనంత సింపుల్‌గా ఉండటమే ఇష్టం. కోట్లాది ప్రజలు ఆకలితో మలమల మాడుతుంటే రచయితనై ఉండీ నేను ఆకలి స్వరూపమేంటో కూడా తెలుసుకోకుండా బతకడం సిగ్గుచేటని భావిస్తున్నాను. అందుకే ఆకల్ని ప్రాక్టీసు చేయడం. నన్ను నేను నావాళ్ళతో మమేకం చేసుకుంటానికే, నా పూర్వస్థితిని మరువకుండా ఉండడానికే ఈ ప్రయత్నం. అలాగని ఇదేదో మహత్కార్యమని, నేనేదో మహాత్ముడిని అని చెప్పడంలేదు. ఇది నాతోనే ఉండాలనుకున్నాను. కాని ప్రాణ స్నేహితుడివని నీకు చెప్పక తప్పలేదు. ఈ విషయం మనిద్దరి మధ్యే ఉండాలి. జయకు ఈ విషయం చెబితే నన్ను బలవంతంగానైనా లాక్కెళ్ళి పిచ్చాసుపత్రిలో జాయిన్ చేస్తుంది" అంటూ నవ్వాడు విశ్వనాథం.

అంత సీరియస్ విషయాన్ని నవ్వుతూ చెబుతున్న మిత్రునికి మనసులోనే వందనాలర్పిస్తున్నాడు మోహన్‌రెడ్డి.

"ఇదన్నమాట ప్రొఫెసర్‌గారి ఆంతర్యం" తనలో తాను అనుకుంటున్నాడు.

✦